


బాగా ప్రొద్దుపోయింది.

చలిగాలి రివ్వుమని వీస్తూ వుంది.

నీరసంగా వీధి తలుపుమీద చెయ్యివేసి తోసేడు రామ్మూర్తి.

తలుపు కిర్రుమని తెరుచుకుంది.

హాలులో సోఫాకి చేరబడి నిద్రపోతున్న సూరిగాడు వులిక్కిపడిలేచి కళ్ళు నులుముకుంటూ నిలబడ్డాడు.

'అమ్మగారు లేరేరా?'

'లేరు బాబూ.' 'పిల్లలు?'. 'ఆరూ లేరు బాబూ.'

'ఎక్కడికి వెళ్ళారు?'

'వర్ధనమ్మగారింట్లో 'పార్టీ' వుందట. అంతా వెళ్ళేరు బాబూ! ఇంటికి రాగానే తవర్ని అక్కడికే వెంటనే రమ్మనమని చెప్పేరు.'

'అహా'

బయట కడుగేసి వీధి మెట్లమీద నిల బడి సిగరెట్టు వెలిగించుకున్నాడు రామ్మూర్తి.

గుప్పుగుప్పున పొగవదుల్తూ చీకట్లోకే చూస్తుండిపోయాడు. చీకట్లో తోరణాల్లా లైట్లు.

అంతదూరాన రాజలింగం బంగళాలో ఇంకా లయిట్లు వెలుగుతూనే వున్నయి.

రాజలింగివూ ఇప్పటివరకూ క్లబ్బులో పేకాడుతూనే వున్నాడు. రాజలింగం, పని మీద మద్రాసు వెళ్తున్నాడట. రైలు పన్నెండింటికట. అందుకని పదకొండుదాకా క్లబ్బులోనే పేకాడి అప్పుడే టాక్సీ వేసుకుని స్టేషనుకి వెళ్ళేడు రాజలింగం. ఇరూరయిన వ్యాపారవిషయమట. మూడు నాలుగురోజులుదాకా రాడట. మళ్ళీ రాజలింగం, తను వెళ్ళేటప్పుడు రామ్మూర్తిని పక్కకి తీసుకెళ్ళి చెప్పేడు. 'నాలుగురోజులు 'మావాళ్ళు' ఒంటరిగావుండాలి. పనిమనుషులువున్నారుగాని విశ్వాసహీనులు. ఆవిడకి వాళ్ళమీద నమ్మకంలేదు. కనుక కాస్త మీవాళ్ళకి చెప్పు అంతదాకా చేదోడు వాదోడుగా వుండమని.'

'అట్లాగే! అదేమంత భాగ్యం' అని భరోసా ఇచ్చేడు రామ్మూర్తి.

రాజలింగం తృప్తిగా శ్వాసపీల్చి రామ్మూర్తి చెయ్యివదిలి వెళ్ళిపోయేడు. రామ్మూర్తికి ఆరోజు పేకాటలో బాగా డబ్బులుపోయేయి. అందరి దగ్గరా రాజలింగం గుంజేడు. డ్రింక్సూ అందరికన్నా

ఎక్కువగానే తాగేడు రాజలింగం.

రాజలింగమంటే రామ్మూర్తికి మంట. రాజలింగం ఆ వయస్సులో మళ్ళీ పెళ్ళి చేసుకోటం రామ్మూర్తిని పుండువలె బాధపెట్టింది. ఆపయిన ఆ రెండో భార్యకి ఏడాది క్రితం కొడుకుపుట్టటం ఆ పుండు మీద కారం చల్లినట్లయింది.

రాజలింగం రెండో భార్య వసంత, రామ్మూర్తి చిన్నప్పటి క్లాసుమేటు. వసంత అందగత్తె! ఆమెదీ రామ్మూర్తి వూరే. రామ్మూర్తి ఆరోజుల్లో వసంతని పెళ్ళి చేసుకోవాలనుకుని ప్రేమించాడు రహస్యంగా.





**పాత తరహా వైద్యాలెందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' బాధను ఎంతో త్వరగా తగ్గించేటప్పుడు.**

అయింట్‌మెంటులు, పూతలు, మామూలు బిళ్లలూ-ఇవన్నీ పాత తరహావి. అవి పని చెయ్యటానికి ఎంతో కాలం తీసుకుంటాయి. అంతకాలమూ మీరు బాధను అనుభవించాల్సివస్తుంది. ఏమాత్రం తలనొప్పి గాని, ఇతర నొప్పులు గాని కనిపించగానే మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' తీసుకుంటాను. అంతే! నొప్పి చిటికెలో తగ్గిపోతుంది.

నొప్పిని తగ్గించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' శాస్త్రీయమైన ఆధునిక నివారణ. 'మైక్రోఫైన్డ్' అంటే ప్రతి 'ఆస్ప్రో' బిళ్ల 150 మిలియన్ల అతి సూక్ష్మమైన అణువులను కలిగి ఉండటం. ఈ అణువులు అతి త్వరగా కరుగుతాయి, ఇముడుతాయి, అంత త్వరగానూ నొప్పిని తగ్గిస్తాయి. మీకు సత్వర నివారణ కలిగించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' మామూలు బిళ్లలకంటె రెట్టింపు త్వరగా పనిచేస్తుంది.

అనవసరంగా బాధను అనుభవించకండి.. మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను తీసుకోండి.

మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను- నొప్పి · తలనొప్పి · ఫ్లూ · ఒళ్లు నొప్పులు · జలుబు · కీళ్లనొప్పులు · గొంతునొప్పి · వంటినొప్పులకి వాడండి.

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్లలు, అవసరమైతే మళ్లీ వేసుకోండి, పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహానుసరించి వేసుకొనవలెను.




**నెమ్మదిగా నివారించును**
బిళ్లలోని పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి. నొప్పి తగ్గటానికి చాలా సేపు పడుతుంది. కనుక అంతసేపూ మీరు బాధ పడాల్సి వస్తుంది.

**శీఘ్రముగా నివారించును**
బిళ్లలోని చిన్న అణువులు త్వరగా ఇముడుతాయి. బాధా మూలమును త్వరగా చేరుకుంటాయి. కనుక త్వరగా నొప్పిని తగ్గిస్తాయి.



**నొప్పిని అతిశీఘ్రముగా తొలగించడానికి 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది.**

నికోలస్ తయారు

A.G.49 (9) TL


# పవిత్ర పాపి

కాని అతను తల్లిదండ్రుల బలవంతంమీద కొండంత ఆస్తితో వచ్చిన జయమ్మని కిక్కురుమనకుండా పెళ్ళిచేసుకోక తప్పలేదు; ప్రేమ ఒకచోట, పెళ్ళి మరోచోట. అదే విధి వైపరీత్యం. కాని... ఆవిధికే తల ఒగ్గి వసంత రాజలింగాన్ని పెళ్ళిచేసుకోవటం రామ్మూర్తికి సుతరామూ నచ్చలేదు. పైగా ఆమె ఆ వూళ్ళోనే తన కళ్ళెదటే రాజలింగం అనే వృద్ధుడితో కాపురం చెయ్యటం మరింత అసహ్యంగా అనిపించింది రామ్మూర్తికి.

ఆస్తి, అంతస్తులలో రాజలింగం తన కంటె ఒకమెట్టు పైనేవుండటమూ రామ్మూర్తిని క్రుంగదీసింది. రాజలింగం ముసిలివాడు. ఆస్తిపాస్తులు వుండవచ్చుగాని ఈడుజోడుకాని సంసారం సుఖాన్నెలా ఇవ్వగలదు?!

ఆ రోజుల్లో తనని రామ్మూర్తి అనే నాయకుడు ప్రేమించినట్టు, ఆ ప్రేమ విఫలమైనట్టు, పెద్దల పట్టుదలలు తనని ఆ స్వర్గలోకాన్నుంచి త్రోసివేసినట్టు వసంతకి తెలియదు. ఆవిషయం రామ్మూర్తికి మాత్రమే తెలుసు

పేదరికంతో క్రుంగిపోతున్న తల్లిదండ్రులకోసం, తన వెనకవున్న తోడబుట్టినవాళ్ళకోసం వసంత, జీవితంతో రాజీపడి వుండవచ్చు. కాని వసంత ఆపనిచెయ్యటం రామ్మూర్తి గుండెల్లో రంపప్పుకోతే అయింది, అందుకే.

స్వతహాగా జయమ్మ నోరు పెద్దది. దానికితోడు కూడా తెచ్చిన ఆస్తిపాస్తులు ఆవిడ ఆధిక్యానికి బలం ఇచ్చేయి. రామ్మూర్తి మొండివాడు. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవటానికి, భార్యమీద భర్తగా తన అధికారాన్ని నిలుపుకోవటానికీ రామ్మూర్తి విశ్వప్రయత్నం చేశాడు. పెళ్ళయి పదేళ్ళవుతుంది. నలుగురు పిల్లలూ పుట్టారు. ఇంత జరిగినా భార్యాభర్తల మధ్య ఇన్నాళ్ళూ నిరంతరమూ జరుగుతూ వచ్చిన ప్రచ్ఛన్నమయిన సంఘర్షణ ఇంకా సాగుతూనే వుందిగాని 'రాజీ' సూచనలు కనిపించలేదు, నేటికిన్నీ.

అందుకే మనశ్శాంతికోసం రామ్మూర్తి కొత్త అలవాట్లు నేర్చుకున్నాడు.

క్లబ్బుకి వెళ్ళి పేకాట, తాగుడు నేర్చుకున్నాడు. పొద్దుపోయాక ఇల్లు చేరుకోటం అలవర్చుకున్నాడు, కావాలనే ప్రతి విష

# పవిత్ర పాపి

యానికి జయమ్మని ఎదిర్చి మాట్లాడటం, నడవటం అలవర్చుకున్నాడు!

'మీకు ఇంకా బుద్ధి ఎన్నాళ్ళకి రాను?' అని నిష్కర్షగానే అడుగుతుంది జయమ్మ.

'నా బుద్ధి నిన్ను కట్టుకోవటంతోనే చచ్చిపోయింది. అది తిరిగి వస్తుందన్న నమ్మకం లేదు.'

'కనీసం కన్నపిల్లల కోసమయినా 'మనిషి' మారకపోతే ఎలా? ఇప్పుడు మీకు ఏం తక్కువయిందని? ఊరికే తిని కూర్చోవటంకూడా కష్టమయితే ఎలా బాబూ! ఎందుకు నన్నిట్లా ఏడిపించుకు తింటం?' జయమ్మ ఆవేదన.

'కాదు. నువ్వే నన్ను ఏడిపించుకు తింటున్నావు. నా మెడకి గుదిబండలా తయారయావు.'

ఆవేశంతో జయమ్మ నోరు పెంచి శోకాలు తీస్తుంది.

రామ్మూర్తి తలపట్టుకుని బయటికి వెళ్తాడు.

సంసారమన్నా, జయమ్మ అన్నా రామ్మూర్తి కి అసహ్యం; భయం.

అయినా తప్పదు. ఈ రోజుల్లో ప్రతి చిన్న దానికీ డబ్బు కావాలి. రామ్మూర్తికి నిత్యావసరాలకి డబ్బు చాలా అవసరం. అందుకే జయమ్మ లేకపోతే రామ్మూర్తికి అస్తిత్వం లేదు. తెల్లవారితే రామ్మూర్తికి జయమ్మ డబ్బుతో అవసరం మరి! తిట్టినా, శాపనార్థాలు పెట్టినా రామ్మూర్తికి జయమ్మనుంచి అవసరాలకోసం డబ్బు ముడుతుంటుంది. అందుకే రామ్మూర్తి స్థానభ్రంశం పొందక అక్కడే నిలబడి పోరాటం సాగించాలని నిర్ణయించుకున్నాడు. శూన్యంతో ముష్టి యుద్ధంలా.

'ఒక్కనాడయినా పిల్లల్ని దగ్గరకి తియ్యరు' అని సాధిస్తుంది జయమ్మ.

'వాళ్ళు పిల్లలు కారు. రాక్షసులు.'

'ఏ తండ్రీ తన పిల్లల్ని అట్లా అన లేదు.'

'నేను అంటున్నాగా...'

'నా పిల్లలు కాదు. వీరే రాక్షసులు. నన్నూ నా పిల్లల్నీ రాచి రంపాన పెడుతున్నారు. మా నాన్నే వుంటే ఇలా జరిగేదా? మీ ఆటలు ఇలా సాగేవా?...'

'అందుకే ఆ మహానుభావుడికి త్వరగా నరకానికి 'టికెట్' ఇప్పించాను. లేకపోతే నీకు తోడు ఆయనకూడా నామీద పెత్తనం చెలాయించేవాడు.' విరసంలోనే రామ్మూర్తి సరసం.

'అంత కఠినంగా ఎట్లా మాట్లాడుతారండీ. మీకు హృదయం లేదా?' అని శోకాలు తీస్తుంది జయమ్మ. అదే... జయమ్మ తురుపుముక్క, రామ్మూర్తి నోరు కట్టాను. నోరున్న ఆడదంటే రామ్మూర్తికి భయం. ఆడదాని ఏడుపు అతను సహించలేడు. అందుకే రామ్మూర్తికి జయమ్మ మీద కోపం. ఆడజాతి మీదనే అసహ్యం. ఆ రెండూ పుష్కలంగా వున్న జయమ్మ అంటే రామ్మూర్తికి భయం కూడాను. ఆ భయాన్ని లోలోపలే అణచుకుని పైకి గాంభీర్యం నటిస్తాడు రామ్మూర్తి.

డబ్బు కోసము తను మోసపోయాడు. జయమ్మ 'అందగత్తె' కాదు. ఇద్దరి మధ్య సారస్యమూ లేదు. తన తత్వానికి జయమ్మ సరిపడదు. జయమ్మ డబ్బు తనని కొనేసింది.

జయమ్మ తన జీవితానికి గుదిబండలా తయారయింది. వద్దనుకున్నా ఇప్పుడు చెయ్యగలిగింది లేదు. తను భరించక వేరు దారిలేదు. పెద్దల చలవ. బ్రహ్మరాత. ఆ ఆలోచనే రామ్మూర్తిలో విపరీతమయిన ప్రతీకార జ్వాలని రేపుతుంది. ఆ అగ్నికి ఆజ్యంవలె తోడయింది. తన ఖర్మగాకపోతే ఆ రాజలింగమూ, వసంతా ఈ వూళ్ళోనే తన కళ్ళ ఎదటే వుండాలా? రాజలింగం మొదటి భార్య నిస్సంతుగా పోయింది. తను సంపాయించిన ఐశ్వర్యం పరుల పాలవుతుందనే భయంతో, వసంత మీద జాలి నటించి అతను వసంతకి అన్యాయం చేశాడు. కాకి ముక్కుకి దొండపండు.


కాని వసంతలో ఆ నిరాశలేశమాత్రమయినా కనపడదే?!

అదే రామ్మూర్తి బాధ.

వసంత రాజలింగాన్ని కొంగున ముడేసుకుంది. ఆ అనాకారిని భర్తగా భరించటానికి సంతోషంగా అంగీకరించింది. రాజలింగంతో పార్టీలకి విందులకి తిరుగుతుంది. ఎంతో తృప్తిగా వున్నట్టు అగుపడ్తుంది, వసంత!

ఆదేమి మనిషి? ఆ ఉత్సాహం ఎక్కడిది? ఆ సంతోషం ఎందుకట? ప్చ్. అసలు వసంత ఆ 'ముసలి వాసన'ని ఎలా భరిస్తుంది?! ఈడాజోడా?!

సిగరెట్టు చివరంటా కాలి వేళ్ళు



చురుక్కుమంది.

ఉలికిపడి సిగరెట్టు అవతలకి విసిరేశాడు రామ్మూర్తి.

ఒకవేళ ఇదంతా...?! 'ఆ ఆలోచన' వచ్చి ఉషారుగా గిర్రున వెనుదిరిగాడు రామ్మూర్తి. గబగబా మెట్లెక్కి 'బాత్ రూం'లోకి వెళ్ళాడు. సబ్బుతో ముఖం తోమి పౌడరు పూశాడు. బీరువాలోంచి సిల్కుచొక్కాతీసి వేసుకుని సెంటు రాశాడు. ఉంగరాల జుట్టుని అదిమి దువ్వి ఆకుజోళ్లు టక టకలాడించుకుంటూ మేడ దిగివచ్చాడు.

'అరే సూరీ! తలుపేసుకోరా!' అని వీధినపడ్డాడు, రామ్మూర్తి.

చలిగాలి రామ్మూర్తికి గిలిగింతలు పెట్టింది.

హృదయంలోంచి తన్నుకవస్తున్న కోరికలు చక చక అడుగులుపడేలా చేశాయి. గబ గబా నడిచివచ్చి 'ఆ మేడ' కెదురుగా నిలిచాడు. అది రాజలింగం ఇల్లు.

రాజలింగం మేడలో ఇంకా లైట్లు వెలుగుతూనే వున్నాయి.

అవును. ఇన్నాళ్ళూ వసంత నటించింది. గుండెల్లోని కోరికల్ని దాచుకుని రాజలింగానికి విశ్వాసపాత్రంగా వున్నట్టు మెలిగింది. ఆ నటనా ప్రపంచంకోసమే. వసంత హృదయం తనదే. అది తనే అర్థం చేసుకోలేకపోయాడు. ఆడదాన్ని అర్థం చేసుకోవటం కష్టం. మాటలకి చేతలకి అర్థాలే వేరు— ఆడదానికి సంబంధించినంతవరకూ.

గేటు తీసి తోటలోగుండా నడుస్తూ పోర్టికో దగ్గరకి వచ్చాడు రామ్మూర్తి. పిల్లిలా అడుగులువేసి తలుపుమీద చెయ్యి వేసి తోశాడు. కావాలని తీసివుంచినట్టు తలుపు తెరుచుకుంది!

అవును. తనకోసం వసంత కాచుకుని వుంది. అందుకే రాజలింగంతో వసంతే అలా చెప్పించి వుండవచ్చు: 'మావాళ్ళు ఒంటరిగావుంటారు, చూడమని.' అమ్మ! వసంత ఎంత గడుసరి!

తనెంత అదృష్టవంతుడు. జీవితాన్ని ఆనందమయం చేసుకోటం, దుఃఖభాజనం చేసుకోటం రెండూ మనిషి చేతుల్లోనే! వసంత ఎంత తెలివిగలది!

రాజలింగం ఎంత అమాయకుడు! అది మూర్ఖతతోకూడిన పిచ్చి నమ్మకం!

ఇంటి లోపల్నుంచి వెలుగు వచ్చి రామ్మూర్తి మొహంమీద కొట్టింది. కళ్ళు మూసుకుని ఇంట్లోకి నడిచి వెనకే తలుపు వేశాడు రామ్మూర్తి.

ఎదురుగా...,

హాల్లో సోఫాలో తల వంచుకుని కూర్చున్నది ఎవరు?

వసంత.

వసంతే!


# ప్రత్యేక సందర్భములకై దుర్గా గ్లాసులు.





గంభీర్యమైన రూపములలో, రంగురంగుల డిజైన్‌లలో, గట్టి దుర్గా గ్లాసులు పార్టీలకు విశేషమైన మెరుగునిస్తాయి.

ఈ గుర్తుకై చూడండి. SDG

**SHREE DURGA GLASS WORKS**

P. O. Barang, Dist. Cuttack.

దేవకన్య వలె మెరిసిపోతున్న వసంత! తన కలల పంట!

రామ్మూర్తి కాలు టీపాయికి తగిలి ఫ్లవర్‌వేజు కింద పడింది, గల్లుమని.

రామ్మూర్తి వణుకు నణచుకోవటానికి ప్రయత్నించేడు.

వసంత తలెత్తి చూసింది.

ఆమె ఒళ్లో పడుకుని నిద్రపోతున్న పాపాయి, అదొక అద్దు కాబోలు! సిల్లీ.

'రామ్మూర్తిగారా! రండి.' వసంత కనులలో మెరుపు!

రామ్మూర్తి ఆమె దగ్గరకి నడిచాడు.

'రండి. కూర్చోండి. ఎంతదృష్టం! ఇందాకట్నించీ ఒంటిగా భయంతో నేను చచ్చిపోతున్నాను. నౌకరు తన తమ్ముడికి జబ్బుగా వుందని వెళ్ళాడు. పని మనిషి తన పని ముగించుకుని వెళ్ళిపోయింది. దేవుళ్ళా మీరు వచ్చారు. నా ఆందోళన సగం తగ్గింది. నా ఒంటరితనం పోయింది.'

రామ్మూర్తి నవ్వటానికి ప్రయత్నించాడు.

మాట్లాడదామని నోరు తెరవబోయాడు.

'వసంతా! నీ బాధ నాకు తెలుసు. నేనూ నీలా బాధపడుతున్నవాణ్ణే. కనుకనే నిన్ను అర్థం చేసుకున్నాను. ఆ భగవంతుడే మనకీ ఈ అవకాశం కల్పించాడు. గుండెలు విప్పి మాట్లాడుకుందాము. మన జీవితాలకి బంగారు రోజులు వచ్చాయి వసంతా! ఇన్నాళ్లూ నిన్ను అర్థం చేసుకోలేకపోయినందుకు నన్ను క్షమించు వసంతా!' అందామనుకున్నాడు; కాని నోరు పెగిలి రాలేదు, రామ్మూర్తికి.

'బాబు ఇప్పటిదాకా ఒకటే ఏడుపు. ఏడ్చి ఏడ్చి అలిసిపోయాడు. పిచ్చి తండ్రి! ఏం చెయ్యాలో నాకు తోచటం లేదు. ఈ రాత్రిపూట ఒక్కదాన్నీ ఏం చెయ్యగలను చెప్పండి? సమయానికి ఫోను చెడి కూర్చుంది. నాకు గాభరాగా వుంది. మీరు దయచేసి వెంటనే డాక్టర్ని పిల్చుకురాండి. ప్లీజ్!' అంది వసంత. ఆమె గొంతు బొంగురుగా అయింది.

ఆమెని పరీక్షగా చూశాడు రామ్మూర్తి.

వసంత కళ్ళు ఎర్రగా వున్నాయి, బుగ్గల మీద కన్నీటి చారికలు!

# పవిత్ర పాపి

ఒక్కసారిగా మొహం కప్పుకుని ఏడ్వసాగింది వసంత, మరలా.

రామ్మూర్తి గాభరాపడ్డాడు.

అతని ఆలోచన్లు చెదిరిపోయేయి. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

'ఇదుగో ఒక్క నిముషం. వూరుకోండి. మరేం భయం లేదు. డాక్టర్ని తీసుకొస్తా.' తడబడే అడుగులతో బయటికొచ్చాడు. డాక్టర్ని తీసుకొచ్చేప్పటికి పది నిముషాలు పట్టింది. ఆ నడకలో రామ్మూర్తి కాలికి ఎదురుదెబ్బ తగిలి బొటనవేలిగోరు పడిలింది.

డాక్టరు వచ్చి బాబుని పరీక్ష చేశాడు.

బాబుకి ఇంజక్షన్లు ఇచ్చి 'ఇప్పుడు మరేం భయం లేదు. ఆలస్యంచేస్తే మాత్రం ప్రమాదం జరిగేది. మీరదృష్టవంతులు. ఇప్పుడేం ఫర్లేదులెండి. కంగారు పడకండి. కాసేపటికల్లా బాబు లేచి ఆడుకుంటాడు.' డాక్టరు ఆ మాట అనటంతోటే వసంత మొహం విప్పారింది. పాపని వుయ్యాల్లోవేసి తదేకంగా చూసింది. వాణ్ణి ఆప్యాయంగా నిమిరింది.

'నన్నూ, నా బిడ్డనీ రామ్మూర్తిగారే దేవుళ్ళా వచ్చి కాపాడారు. లేకపోతే ఈ రాత్రి ఎంత భయంకరంగా ఉండేదో. రామ్మూర్తిగారి ఋణం మేము తీర్చుకోలేము.' అంటూ కృతజ్ఞతతో, ఆప్యాయంగా చూసింది వసంత. ఫ్లాస్కులోంచి కాఫీ తీసుకొచ్చి గ్లాసుల్లో పోసి అందించింది ఇద్దరికీ. ఆమె చూపుల్లోని నైర్మల్యానికి సిగ్గుతో ముడుచుకుపోయాడు రామ్మూర్తి. గుండెలు చల్లని నీటితో తడిసినట్లయింది. నరాల్లో ఒణుకు—మండుతున్న గుండెల్లో నీళ్ళు పోసినట్టు.

కాసేపటికి బాబు లేచి కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ఆడుకోసాగాడు.

కాఫీ తాగి డాక్టరు వెళ్ళిపోయాడు. 'మరేం భయంలేదు. నిశ్చింతగా వుండండి.' అని చెప్పి.

'ఈ రోజు నేనెంతో అదృష్టవంతురాల్ని; నాకు అన్నయ్య లేడని బాధపడేదాన్ని. భగవంతుడిచ్చిన అన్నలా ఇవాళ మీరే రాకపోతే ... తల్చుకోటానికే భయం వేస్తోంది రామ్మూర్తిగారూ! మీరు దేవుడు...'

రామ్మూర్తి మూగగా చూశాడు.

అతని గుండెలు విపరీతమయిన వేగంతో కొట్టుకున్నాయి.

కళ్ళు అప్రయత్నంగానే తడిని తెచ్చుకున్నాయి.

'వసంతా! నేను పాపిని తల్లీ! నికృష్టమయిన ఆలోచనలు పెట్టుకుని మలిన హృదయంతో నీ గుమ్మం తొక్కినవాణ్ణి. నన్ను దేవుడిగా చేస్తున్నావా? దేవుడున్నాడు తల్లీ! వాడే తప్పక నిన్ను జాగ్రత్తగా కాపాడుతాడు.' అనుకుని లేచాడు రామ్మూర్తి.

'బాబుకి మరేమీ ఫర్వాలేదు తల్లీ. ఈ రాత్రి నీకు తోడుగా మా సూరిని పంపిస్తాను. తలుపులు వేసుకుని పడుకో. వస్తాను.' అని చెప్పి బయటకి వచ్చాడు. గబగబా నడిచాడు. ఇంటికొచ్చాడు. సూరిని నిద్రలేపి సంగతి చెప్పి రాజులింగం ఇంటికి పంపించేడు. తలుపు గడవేసేడు; పడగ్గదిలో అడుగుపెట్టేసరికి జయమ్మ అతనికోసం ఎదురు చూస్తోంది. చీకట్లో పెద్దపులిలా చూస్తూ.

ఇంటినీ, ఇల్లాలినీ నిర్లక్ష్యం చేస్తున్నందుకూ, పార్టీకి రాకుండా క్లబ్బుల్లో గడిపి నలుగుర్లో తలవంపులు తెచ్చినందుకూ, అవిగాక మరెన్నో కారణాలనీ—చూపించి రామ్మూర్తిని ఎన్నో ఆడిపోసింది జయమ్మ. ఎంతో భయంకరమైన సంఘర్షణకి సిద్ధపడిన జయమ్మని ఒక్క మాటకీ ఎదురాడక నిజస్వభావ విరుద్ధంగా మౌనంగా అన్నీ భరించిన రామ్మూర్తి తత్త్వం ఆశ్చర్యపరిచి ఆమె నోటిని కట్టిపడేలా చేసింది చివరికి.

'పొరపాటయింది లేవే. ఇకనుంచీ ఆ అలవాట్లన్నీ మానేసి నీ ఇష్టప్రకారం నడుచుకుంటానుగా.' అన్న రామ్మూర్తి చివరి మాటకి ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొనగా అతన్ని క్షమించి తప్పుచేసి పశ్చాత్తాపపడుతున్న కుర్రవాణ్ణి ప్రేమతో దగ్గరకి తీసుకున్న చందంగా రామ్మూర్తిని దగ్గరకి లాక్కుంది జయమ్మ.

తొలికోడి కూత 'కొక్కొరొకో' అని ఆ వాడంతా ప్రతిధ్వనించింది. ●